RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 270 పేజీలు - 08 శనివారం 23 ఆగస్టు 2025

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**తొలి అక్షరం/నిజామాబాద్,ఆగస్ట్22:** జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తి నీటి నిల్వ సామర్థం 80.5 టీ-ఎంసీలు కాగా.. ప్రస్తుతం 79.65 టీ-ఎంసీలుగా నమోదైంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు, ఔట్‌ఎలో 78,812 క్యూసెక్కులుగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,500 క్యూసెక్కులు, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరుకుంది.





తెలంగాణలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ముందంజ

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగ పత్రాలు

ప్రజాభవన్ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి

## సీఎస్ఆర్ నిధులతో మండలానికో అంబులెన్స్

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** సీఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి అంబులెన్స్ ఏర్పాటు చేస్తాం అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురుకులాల విషయంలో ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికలతో వెళ్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎనర్జీ పాలసీ తీసుకొచ్చాం. రెప్పపాటు- కూడా విద్యుత్ పోకుండా చర్యలు చేపడుతున్నాం అని అన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు ప్రజాభవన్ లో 320 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి.. దాదాపు 500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. ఆనాడు భూములిచ్చింది ఇందిరమ్మే.. ఈనాడు ఉద్యోగాలు ఇస్తోంది మిగతా2లో...

## అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదు

దీనిపై చట్టం తీసుకుని వస్తే వ్యతిరేకిస్తే ఎలా

బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ వెల్లడి



2లో


## ఓట్ల తొలగింపులో రాజకీయ పార్టీల తీరుపై విస్మయం

బూత్ స్థాయిలో ఓటర్లకు సాయం చేయాలని సుప్రీం సూచన

ఓటు సవరణకు గడువు పెంచాలని ఇసికి ఆదేశం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 22:** బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ వివాదంపై సుప్రీం కోర్టు విచారణ కొనసాగింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి బెంచ్ విచారణ చేపట్టింది. డిలీట్ చేసిన ఓటర్ పేర్లను సరిదిద్దే విషయంలో రాజకీయ పార్టీలు అచేతనంగా ఉండటంపై న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వీరు వెళ్లి సవరణలో పాల్గొనాలని సూచించింది. రాజకీయ పార్టీలు చొరవతో ముందుకు రావాలని కోరింది. అదే సమయంలో ఎస్ఐఆర్ పక్రియ ఓటర్ ఫ్రెండ్లీగా ఉండాలని పునరుద్ఘాటించింది. డిలీట్ చేసిన పేర్ల విషయంలో ఆధార్ కార్డు లేదా.. ఏదైనా ఆమోదయోగ్య పత్రంతో పాటు చేసే ఆన్‌లైన్ సబ్మిషన్లను అనుమతిస్తాం అని న్యాయస్థానం పేర్కొంది. పేర్ల తొలగింపులపై భారీ సంఖ్యలో ప్రజల నుంచి స్పందన వస్తే దరఖాస్తు సమర్పణల తుది గడువును ఎందుకు పొడిగించకూడదని జస్టిస్ కాంత్ మిగతా2లో...



2లో

## సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లో తుదిశ్వాస

విద్యార్థి నేత నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు కొనసాగిన ప్రస్థానం

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మద్దతు ఇచ్చిన నేత

నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం

సురవరం మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం

తెలంగాణ మట్టిబిడ్డ సుధాకర్‌రెడ్డి: కేసీఆర్

## హైకోర్టులో కెసిఆర్, హరీష్‌లకు చుక్కెదురు

● పిసి ఘోష్ కమిషన్‌పై స్టేకు నిరాకరణ ● అసెంబ్లీలో చర్చించాకే ముందుకు వెళతాం ● విచారణ నాలుగు వారాలకు వాయిదా



**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. పూర్తిస్థాయి కౌంటర్‌ను దాఖలు చేయాలని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు అసెంబ్లీలో చర్చించిన తరువాతే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం కేసీఆర్, హరీశ్‌రావు ఎమ్మెల్యేలు కాబట్టి.. అసెంబ్లీలో చర్చించాకే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వంపై కూడా హైకోర్టు సీరియస్ అయింది. మిగతా2లో...



## నక్సల్స్‌కు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మద్దతు

అందుకే అవినీతి కేసుల్లో సమస్య రాకుండా చట్టం

విపక్షాల అభ్యర్థి సుదర్శన్ రెడ్డి వామపక్షవాది

కేరళల పర్యటనలో హోంమంత్రి అమిత్ షా

**తొలి అక్షరం/తిరువనంతపురం, ఆగస్టు 22:** విపక్షాల తరఫున ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తున్న జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి కారణంగా దేశంలో నక్సలిజం బలపడిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. సల్వాజుడుం కేసులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పు ఇవ్వక పోయి ఉంటే 2020 కన్నా ముందుగానే దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించి ఉండేవారమని పేర్కొన్నారు. మలయాళం పత్రిక మనోరమ న్యూస్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు. ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసుకోవడంతోనే కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు మరింత దిగజారాయని అన్నారు. 'సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి నక్సలిజానికి సాయం చేశారు.ఆయన సల్వా జుడుం తీర్పునిచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోయి ఉంటే నక్సల్స్ ఉగ్రవాదం 2020నాటికే అంతమై ఉండేది. నక్సల్స్ సిద్ధాంతాలతో స్ఫూర్తి పొందినందునే ఆయన సల్వాజుడుం తీర్పునిచ్చారు' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. మావోయిస్టులపై పోరాటంలో భాగంగా గిరిజన మిగతా2లో...

## కెసిఆర్ పాలనలో యూరియా కొరత లేదు



ముందస్తు ప్రణాళికతో గ్రామాల్లోకి సరఫరా

అసమర్థ పాలనతో ఇప్పుడు అనేక సమస్యలు

ప్రజలకు కూడా కెసిఆర్ పాలనంటే తెలిసింది

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** రైతులను అరిగోస పెడుతున్న ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల పతనం ప్రారంభమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. రైతులకు యూరియా సరఫరాలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరిపాలన అంటే ఏమిటో తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు, కన్నీళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ నాయకత్వం, ముందుచూపు, పకడ్బందీ పాలన అంటే ఏమిటో ఇప్పుడు తెలంగాణ సమాజానికి అర్థమైందని కెటిఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా సంక్షోభం పైన ఆయన స్పందిస్తూ, చిల్లర రాజకీయాలు తప్ప పరిపాలన తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు, కన్నీళ్లు వచ్చాయని ధ్వజమెత్తారు. ఒకవైపు బూతులు మాట్లాడడం మిగతా2లో...



## 25న తెలంగాణ కేబినేట్ భేటీ


బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ

కాళేశ్వరం నివేదికపైనా చర్చించే అవకాశం

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** తెలంగాణ మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. మరో వైపు పంచాయతీ ఎన్నికల కోసం హైకోర్టు విధించిన గడువు సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముంది. శనివారం జరగనున్న మిగతా2లో...

## సిపిఐ కార్యదర్శిగా కూనంనేని

\- వరుసగా రెండోసారి ఎన్నిక



2లో

## బిజెపి అధ్యక్షుడు రామ్ అరెస్ట్ దుర్మార్గం



2లో

## ఓట్ల తొలగింపులో రాజకీయ పార్టీల తీరుపై విస్మయం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ పక్రియలో బిహార్ రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములై తమ బూత్ స్థాయి ఏజెంట్లతో ఓటర్లకు సాయం చేయాలని కోర్టు పేర్కొంది. సూచించిన 11 పత్రాలు లేదా ఆధార్ ఏదైన ఒక దానిని సమర్పించి.. పేరు తొలగింపుపై అభ్యంతరాలు తెలియజేస్తూ.. పేరు తిరిగి చేర్చాలనే దరఖాస్తు ఇవ్వాలని వెల్లడించింది. అదే సమయంలో రాజకీయ పార్టీల మధ్య వివాదాలకు ఓటర్లకు లంకె పెట్టకూడదని జస్టిస్ కాంత్ సూచించారు. ?బిహార్(ఇతశస)లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో తీవ్ర స్థాయిలో అవకతవకలు జరిగాయాంటూ దుమారం రేగింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఇప్పటికే ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాజకీయ పార్టీలో వెళ్లి ఓటు నమోదును పూర్తి చేయించాలని సూచించింది.

## సిపిఐ కార్యదర్శిగా కూనంనేని

**• వరుసగా రెండోసారి ఎన్నిక**

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ప్రజాగొంతుక, పీడిత ప్రజల ఆశాజ్యోతి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గాజుల రామారంలోని కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల్లో శుక్రవారం సాంబశివ రావును ఎన్నుకున్నారు. ఈ మేరకు సిపిఐ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్తగూడెం శాసనసభ్యుడిగా ఉన్న సాంబశివరావు ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీ మహాసభల సందర్భంగా ఆయనను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాంబశివ రావు పార్టీ జాతీయ నేతలు, రాష్ట్ర నేతలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నక్సల్స్‌కు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

యువతను కోయ కమాండోలు, సల్వా జుడుం పేరిట ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించడాన్ని సుప్రీంకోర్టు 2011లో రద్దు చేసింది. ఇది చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం అని నాడు సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న సుదర్శన్‌రెడ్డి తీర్పు చెప్పారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహించే వ్యక్తిని తమ అభ్యర్థిగా నిలబెట్టిందని షా ఆరోపించారు.

## సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిశారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు మూడు రోజులుగా హైదరాబాద్ శివారులోని జరుగుతుండగా, శుక్రవారం నూతన కమిటీ ఎన్నికతో సభలు ముగిశాయి. ఇంతలోనే సురవరం మరణ వార్త తెలియడంతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సురవరం మరణం విషయం తెలియగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని కొండ్రావుపల్లి గ్రామంలో 1942 మార్చి 25లో జన్మించిన సురవరం.. 1998, 2004లో రెండుసార్లు నల్లగొండ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సీపీఐ విద్యార్థి విభాగం ఏఐఎస్ఎఫ్ నుంచి మొదలైన ఆయన ప్రస్థానం సీపీఐ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది.

## బిజెపి అధ్యక్షుడు రామ్ అరెస్ట్ దుర్మార్గం

**• బిజెపి అంటే ఎందుకంత భయం: ప్రభుత్వంపై బండి విమర్శ**

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్టును కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుంటే ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భారత రాష్ట్ర సమితి బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. అరెస్టులతో వైఫల్యాలు కప్పిపుచ్చుకోవాలని ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. తక్షణమే రామచందర్‌రావు, కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భాజపా నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలన్నారు. చేయాల్సింది అరెస్టులు కాదు.. సమస్యల పరిష్కారమని చెప్పారు. నిరంకుశ విధానాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో మట్టి కరిపించడం ఖాయమన్నారు.జీహెచ్ఎంసీలో సమస్యల పరిష్కారం కోరుతూ భాజపా శుక్రవారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మొయినాబాద్ వద్ద ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును హైదరాబాద్‌కు వస్తుండగా అరెస్టు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు- కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళు న్న ఆయన్ని ఎందుకు అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా పోలీసులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తుందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవాలనుకుంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అయినా బీజేపీ అంటే అంత భయమెందుకు అని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్దతిలో నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు- అని అభివర్ణించారు. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అరెస్టయిన బీజేపీ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

## కెసిఆర్ పాలనలో యూరియా కొరత లేదు


(మొదటి పేజీ తరువాయి)

తప్ప చేతలు రాని ఢిల్లీ పార్టీల నాయకులకు, మరోవైపు వందేళ్ల విజన్‌కు నిలువెత్తు రూపమైన కెసిఆర్‌కు ఉన్న స్పష్టమైన తేడా నాలుగు కోట్ల తెలంగాణ సమాజానికి ఇప్పుడు అర్థమైపోయిందని వ్యాఖ్యానించారు.గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో యూరియాను సకాలంలో తెప్పించడానికి ఎన్నెన్ని ప్రణాళికలు, కసరత్తులు జరిగాయో ఆయన వివరించారు. వ్యవసాయ అధికారులతో కెసిఆర్ వరుస సమీక్షలు నిర్వహించేవారని, కేంద్రానికి ప్రతి సీజన్‌కు ముందే లెక్కలతో సహా వినతులు సమర్పించేవారని గుర్తు చేశారు. అంతేకాకుండా, ఎసిలోని నౌకాశ్రయాలకు మన అధికారులను పంపి, సరఫరాను పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేసేవారని తెలిపారు. యూరియా సరఫరా కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులకు స్వయంగా కెసిఆర్ ఫోన్ చేసి, 25 స్పెషల్ గూడ్స్ ట్రెయిన్‌లను ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేవారని పేర్కొన్నారు. అవసరమైతే పక్క రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో నేరుగా సంప్రదింపులు జరిపి, ఏకంగా 4 వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారని తెలిపారు. కెసిఆర్‌కు ఉన్న ఈ ముందుచూపు, దక్షత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం రైతులను కష్టాల పాలు చేస్తోందని ఆరోపించారు. పరిపాలనలో కెసిఆర్‌కు ఉన్న అనుభవం, స్పష్టత ప్రస్తుత పాలకులకు లేవని, అందుకే రైతులు ఇబ్బందులు పడుతున్నారని కెటిఆర్ పేర్కొన్నారు.

## అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదు

**దీనిపై చట్టం తీసుకుని వస్తే వ్యతిరేకిస్తే ఎలా**

**బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ వెల్లడి**



**తొలి అక్షరం/పాట్నా, ఆగస్టు 22:** అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదని, దీనిని సమర్థించే నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని ప్రధాని మోడీ అన్నారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. తప్పు చేస్తే సీఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైల్లో.. లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. బిహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే.. ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగలుగుతాం అని మోదీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని.. ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ– పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## హైకోర్టులో కెసిఆర్, హరీష్‌లకు చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తుగా మీడియా సమావేశం నిర్వహించి.. 60 పేజీల రిపోర్ట్ బయట పెట్టడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అన్ని పబ్లిక్ డొమైన్ నుంచి వెంటనే రిపోర్ట్ తొలగించాలని ఆదేశించింది. కమిషన్ 8ఇ, 8ఈ నోటీసులు ఇవ్వకుండా.. పిటీషనర్లపై ఆరోపణలు చేయడం చట్టవిరుద్ధమని అభిప్రాయ పడింది. మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇక రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే రేవంత్ ప్రభుత్వం కమిషన్ వేసిందని కేసీఆర్, హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగింది. అందులో భాగంగా శుక్రవారం కేసీఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదనలు ముగిశాయి. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఉంటే.. దానిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే పిటిషనర్లు కోరిన విధంగా స్టే మాత్రం ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో నిరాశ ఎదురైనట్లు అయింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టుకు అడ్వకేట్ జనరల్ శుక్రవారం తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అందిన నివేదకను అసెంబ్లీలో ప్రవేశ పెడతామని కోర్టుకు స్పష్టం చేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంటే.. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కోర్టుకు ఏజీ వివరించారు. అంతలో హరీష్ రావు తరఫు న్యాయవాది సుందరం తన వాదనలు వినిపిస్తూ.. మొత్తం కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ నివేదికను అడ్డం పెట్టుకుని తమ పిటిషనర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో తమ వారిపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని కోరుతున్నామని కోర్టు దృష్టికి న్యాయవాది సుందరం తీసుకు వెళ్లారు. అంతేకాకుండా.. జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో కంటే.. ముందే మీడియాకు ఇచ్చి.. తమ పిటిషనర్ల పరువుకు భంగం కలిగించారని కోర్టుకు న్యాయవాది సుందరం తెలిపారు. ఆ క్రమంలో ఈ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఆరు నెలలు సమయం ఉంటు–ందని కోర్టుకు ఏజీ వివరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పగుళ్లు ఏర్పాడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 13 నెలల పాటు వందలాది మందిని విచారించింది. అలాగే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌లను సైతం విచారించి.. కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కర్మ, కర్త, క్రియా అంతా కేసీఆర్ అంటూ ఈ విచారణలో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో ఈ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.

## సీఎస్ఆర్ నిధులతో మండలానికో అంబులెన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ సర్కారేనని తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని తప్పుడు ప్రచారంచేశారు..కాంగ్రెస్ అంటేనే కరెంట్ అని నిరూపించామన్నారు భట్టి విక్రమార్క. ఉద్యోగ అవకాశాల ద్వారా పేదరికాన్ని జయించవచ్చని భట్టి విక్రమార్క అన్నారు. విద్య ద్వారా సామాజిక, ఆర్థిక వెనుకబాటును జయించవచ్చన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, సీఎస్ఆర్ నిధులతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు– చేస్తున్నట్లు– చెప్పారు. దీనిలో 2,600 మంది విద్యార్థులు చదువుకునేలా వసతులు కల్పిస్తున్నామన్నారు. కన్వెన్షన్, నాన్‌కన్వెన్షన్ ఎనర్జీ అందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. దేశంలో అత్యధిక గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నాం. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో పవర్ ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధికారంలోకి రాగానే న్యూ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చామన్నారు. 51 లక్ష కుటుంబాలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. ఏటా రూ.17 వేల కోట్లు– ప్రభుత్వం విద్యుత్ శాఖకు కడుతోందన్నారు భట్టి. విద్యతో పేదరికాన్ని జయించవచ్చని చెప్పారు భట్టి. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు– చేస్తామన్నారు. 5 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు– చేసి 2600 మంది విద్యార్థులు చదువుకునే వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 25న తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ– సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు– ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న కేబినెట్ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం.. ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచాం పంపించే వీలుంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు విచారణపై కూడా చర్చించి.. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా నిర్ణయం తీసునే అవకాశం ఉంది. దీనికోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం నివేదికపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఇటీవల హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం చర్యలు తీసుకుంటామని న్యాయస్థానానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చింది.కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు ఈ భేటీలో తేదీలను ఖరారు చేయనున్నట్టు–గా తెలుస్తోంది.

## ఎసిబికి చిక్కిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్

**తొలి అక్షరం/కరీంనగర్,ఆగస్ట్22:** జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి ఎసిబి వలకు చిక్కారు.వివరాలలోకి వెళితే.. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఒక బాధితుడి నుంచి రూ.5 వేలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశాడు. అయితే, లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు శుక్రవారం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ లంచం డబ్బులు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు–కున్నారు. తదుపరి విచారణ కోసం అతనిని కరీంనగర్ కోర్టుకు తరలించనున్నట్లు– ఎసిబి డిఎస్‌పి మధు తెలిపారు.

## గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ: మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేయడం,రైతులకు న్యాయం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో ఆయన పర్యటించారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీర్లగడ్డ తండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో భూసేకరణకు రూ.25 కోట్లు– కేటాయించి నట్లు చెప్పారు. ఎన్‌జీటీ కేసుకు సంబంధించి ప్రభుత్వం రూ.10 కోట్లు– చెల్లించిందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు నీరందిస్తామని పేర్కొన్నారు. రైతులను రెచ్చగొట్టేలా భారత రాష్ట్ర సమితి వ్యవహరిస్తోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు.


## వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం

**• 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 22:** తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ– హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ– వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

# ఊరూరా ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమం

### కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన ఎంపీడీఓ వేణుమాధవ్





పెద్దవంగర ఆగష్టు 22(తొలి అక్షరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర 2025 కార్యక్రమంలో భాగంగా మండలంలోని వద్దేకొతపెల్లి గ్రామం లొ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించిన ఈజిఎస్ పనులు పంచాయతీరాజ్ కు సంబంధించిన పనులను మండల అధికారులు గ్రామ ప్రత్యేక అధికారులతో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం జరిగినది. అనంతరం గ్రామసభలు నిర్వహించి అట్టి పనుల పై మరియు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వివరించి అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందిని, ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పని దినాలు చేసిన కూలీలను మరియు వాచర్లని సన్మానించడం జరిగింది.పనుల జాతర 2025 కార్యక్రమంలో భాగంగా వద్దేకొత్తపల్లి గ్రామంలో డ్రై ఎండ్ కమ్యూనిటీ సోక్ పిట్టును ఎంపిడిఓ బోడేపూడి వేణుమాధవ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వద్దే కొత్తపల్లి ఆరోగ్య ఉపకేంద్రం హెల్త్ ఆఫీసర్ ఈ రాజుకుమార్,టెక్నికల్ అసిస్టెంట్ సుధగాని యాకయ్య, పంచాయతీ కార్యదర్శి బిర్రు పరమేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎనగందుల హరీష్ కారోబార్ పరశు రామ్.అంగన్వాడీ టీచర్స్ సుకన్య. అరుణ. వెంకటలక్ష్మి. ఆశవర్కర్స్ రజిత. హేమలత. గ్రామపంచాయతీ సీబ్బంది వెంకటయ్య. మల్లయ్య. గ్రామ ప్రజలు తదితరులు పాల్గోన్నారు.

## ఉపాధి హామీ"పనుల జాతర ప్రారంభ కార్యాక్రమం"గ్రామాల్లో గ్రామ సభల నిర్వహణ





తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22: యాదాద్రి భువనగిరి జిల్లాలో శుక్రవారం రోజున ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులకు సంబంధించి పనుల జాతర కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు(ఎం) మండలంలో గ్రామ సభలు నిర్వహించి గ్రామ పంచాయతీ సిబ్బందికి మరియు ఉపాధి హామీ పనులలో మొక్కలను సంరక్షణ, గ్రామ నర్సరీలలో మొక్కల పెంపకం,వికలాంగులలో పనిదినాలు ఎక్కువగా చేసిన కూలీలలో ఒకరిని సన్మానించడం జరిగింది. తిమ్మాపూరం గ్రామంలో పనుల జాతర గ్రామ సభ. గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మల్లయ్య, కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్, వేముల రాములమ్మ, ఉపాధి హామీ కూలీలలో బట్టు లక్ష్మమ్మ నర్సయ్య, కొమిరెల్లి సావిత్రమ్మ, తదితరులను సన్మానించారు అనంతరం. పశువుల పాకలకు మరియు గొర్రెల షెడ్డుకు ముగ్గుపోసిన ఉపాధి హామీ ఏపీఓ బి రమేష్, టీఏ డి శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ జనరంజన్, ఏఫ్ఏ ఎన్ రవిందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మచ్చగిరి, కోల మల్లయ్య, లబ్ధిదారులు తోట్పునూరి మల్లయ్య గౌడ్, కోల అంజయ్య గౌడ్, కోసున అంజయ్య యాదవ్ ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## గడిల పాలనకు చరమగీతం పాడి పోరాడి గెలిచిన మాజీ సర్పంచ్ పెండెం లక్ష్మినారాయణ మృతి

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరీదీప్ రెడ్డి



తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22:యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామా మాజీ సర్పంచ్ పెండెం లక్ష్మినారాయణకు ఘన నివాళు లు అర్పించిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ. కోరటికల్ రాజకీయ కురువృద్ధుడు గడిల పాలనకు చరమగీతం పాడి పోరాడి నిలిచి గెలిచిన ధీరుడు. రెండు పర్యాయాలు గ్రామ సర్పంచిగా గ్రామ ప్రజలకు అనేకమైన సేవలు అందించిన రాజకీయ చాణిక్యుడు.సర్పంచ్ అనే పదవికి వన్నెతెచ్చి మాజీ సర్పంచ్ అనే పేరు చిరస్థాయిగా తనకే దక్కించుకున్న ధీర గుణ శాలి! అపర మేధావి!!బీఆరెస్ సీనియర్ నాయకులు కోరటికల్ గ్రామ మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం తండ్రి పెండెం లక్ష్మినారాయణ నేత గురువారం రోజున అనారోగ్యంతో పరమపదించారు. వారి కుటుంబాన్ని కొరటికల్ తాజామాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియపరచి కె హెచ్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి, సహాయంతో 5000? రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరుకుడు బిందెల సైదులు,సెక్రటరీ జనరల్ చుంచు శ్రీనివాస్, మండల కార్యదర్శి సోలిపురం రామ్ రెడ్డి, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు,మాజీ వార్డు సభ్యులు చుంచు చంద్రయ్య, సీనియర్ నాయకులు ఎరుకల రాములు గౌడ్, కట్టెకోల చిన్న యాదయ్య గౌడ్, శ్రీరాముల కృష్ణ హరి, నరకుడు బిందెల అంజయ్య, బెజ్జరబోయిన లక్ష్మణ్ ముదిరాజ్, కోల వెంకటయ్య, శివరాత్రి మహేష్ మరియు సిపిఐ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నుకోబడిన బంజారా సేవలాల్ సమాజ్ నెక్కొండ మండల అధ్యక్షుడు భూక్య బిచ్చ నాయక్



తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 22: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో బంజారా సేవాలాల్ సమాజ్ అధ్యక్షులు గా నూతనంగా ఎన్నుకోబడిన భూక్యా బిచ్చనాయక్ ని శాలువా తో సత్కరించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, ఇటీవల నూతనంగా బంజారా సేవాలాల్ సమితి అధ్యక్షులు గా భూక్యా బిచ్చ నాయక్, గుగులోత్ మోహన్,ఉపాధ్యక్షులు గా ఎన్నుకోవడం జరిగింది.వారిని సన్మానం చేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి,మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,మండలకాంగ్రెస్పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్,వర్కింగ్ ప్రెసిడెంట్లు ఆవుల శ్రీనివాస్, లావుడ్యా తిరుమల్, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి ,అప్పలరావు పేట్ మాజీ ఉపసర్పంచ్ ఊడ్గుల అశోక్,బానోత్ బాలాజీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల వృద్ధాప్య పింఛన్లు పెంచాలి

### ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు కంటిపూడి అరుణ్ కుమార్ మాదిగ



తొలి అక్షరం/కేసముద్రం ఆగస్టు 22: శుక్రవారం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో విహెచ్పిఎస్ గ్రామ అధ్యక్షులు గోనె వెంకట్ రెడ్డి గారి అధ్యక్షతన వికలాంగులు వృద్ధులు వితంతువుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు కంటిపూడి అరుణ్ కుమార్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వృద్ధులు వితంతువులు వికలాంగులకు పింఛన్ పెంచుతానని హామీ ఇచ్చి గద్దె ఎక్కిన తర్వాత ఆ హామీని మరిచారని వెంటనే వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు వెంటనే పెన్షన్ పెంచాలని లేనియెడల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని కచ్చితంగా పెన్షన్లు పెంచే విధంగా పోరాటం చేస్తామని తెలుపటం జరిగినది ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి విహెచ్పిఎస్ గ్రామ కార్యదర్శి బోనగిరి యాకస్వామి కేసముద్రం టౌన్ ఎమ్మార్పీఎస్ నాయకులు జల్లంపల్లి శ్రీకాంత్ ఎటు రోజు సత్యనారాయణ చారి సాయిలు కత్తుల ఎల్లయ్య అల్లి బీరయ్య కత్తుల ఈరమ్మ తదితరులు పాల్గొనడం జరిగినది.

## ప్రజల సమస్యలపైన తహసీల్దార్‌కి వినతిపత్రం అందచేసిన బిజెపి మండల పార్టీ నాయకులు



తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ అధ్యక్షతన జిల్లా పార్టీ ఆదేశాల మేరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మండల ప్రజా సమస్యలపైన ఎమ్మార్వోకి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బునాదిగాని కాలువ వెంటనే పూర్తి చేయాలని ఆత్మకూరు మండల కేంద్రంలోని ఏపీజీబీ గ్రామీణ బ్యాంక్ టీజీబీబీ రూపాంతరం చెందడం వలన ఐఎఫ్ఎస్సి కోడ్ మారడంతో దాదాపు 200 మంది రైతులు రుణమాఫీ ప్రభుత్వ ఖాతాలో జామాకాక పోవడం వలన వెనక్కి పోవడం జరిగింది. ఆ పైసలు రైతుల ఖాతాలోకి వచ్చే విధంగా ప్రభుత్వం చూడాలని మరియు ఆత్మకూరులోని అసంపూర్ణంగా ఉన్న బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చే విధంగా చూడాలని, ఆత్మకూరులోని 713 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమి కబ్జాక గురి అవుతుంది. ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొబ్బల ఇంద్రారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి రాగటి మచ్చగిరి, భూత్ అధ్యక్షులు లోడ్ వెంకటయ్య, లోడి బద్రి, కోరుకుప్పల నరసింహ,బిజెపి నాయకులు పరకాల రాంబాబు, డాక్టర్ రాజు, గడ్డం స్వామి, ఎండి అబ్బాస్, ఏ రమేష్, ఎస్సీ మోర్చా మండల పార్టీ అధ్యక్షులు మేడి సాగర్, బీజేవైఎం జిల్లా నాయకులు మజ్జిగ నరేష్, లోడి మహేష్, పాల్గొన్నారు.

## మర్యాల గ్రామంలో మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఉదయం 7:00 నుండి మర్యాల గ్రామంలో అన్ని గల్లీలు కలయతిరుగుతూ గ్రామాల్లో స్వయంగా సమస్యలు తెలుసుకున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పనుల పురోగతిని, లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని , అధికారులకు వారి సమస్యలను తెలిపి వెంటనే పరిష్కరించాలని అన్నారు.ఎవరైనా వికలాంగులు ఆర్థికపరంగా ఇబ్బందులు ఉన్న కుటుంబాలకు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేయుతనందిస్తూ , బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో 50 బస్తాల సిమెంట్ ను కూడా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అందిస్తామని వికలాంగుల కుటుంబాలకు తెలిపారు.గ్రామం మొత్తంలో ఎవరైనా మొదటగా ఇల్లు నిర్మాణం చేసుకుంటే వారికి పట్టు బట్టలు పెట్టి యాట పోతును అందిస్తామన్నారు. త్వరితగతిన ఇల్లు నిర్మాణం చేసుకుంటే 5లక్షల బిల్లు పడుతుందని ముందు దశల వారిగా అకౌంట్లో డబ్బులను ప్రభుత్వం జమ చేస్తుందని బీర్ల అయిలయ్య తెలిపారు.

## ఊర చెరువు మిట్ట తూమును ప్రారంభించిన పిసిసి మెంబర్ సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి

### వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి



తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 22: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలో చెరువు దగ్గర మరమ్మత్తులు చేసి ఏర్పాటు చేసిన మిట్ట తూమును ప్రారంభించిన పిసిసి మెంబర్ సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి సాయి కృష్ణ, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, రావుల మధుకర్ రెడ్డి, కక్కర్ల నాగయ్య, రామారావు వీరస్వామి,బండి శీను, బైరు వెంకన్న, నీరాటి కాడు దుండి వీరన్న తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీలలో 2025 సంబంధిత పనుల జాతర

### - ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి





తొలిఅక్షరం/నెక్కొండ ఆగస్టు 22: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని అప్పలరావుపేట గ్రామపంచాయతీలో 2025 పనుల జాతర ను నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ప్రారంభించడం జరిగింది. నర్సంపేట మార్కెట్ చైర్మన్ గౌరవ పాలాయి శ్రీనివాస్ మరియు నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీష్ రెడ్డి ,జిల్లా అడిషనల్ కలెక్టర్ , ఐకెపి ఏపీడి నెక్కొండ మండల ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,ఏ ఈ పి ఆర్ రాజ్ కుమార్, ఏపీవో జాకబ్ ఉపాధి సిబ్బంది,ఏ.పి.ఎం. కిరణ్ మరియు ఐకెపి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఓయూ జాక్ పిలుపు మేరకు బందు పాటించిన వలిగొండ



తొలి అక్షరం/వలిగొండ ఆగష్టు 22: ఈరోజు వలిగొండలోని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు బంధు పిలుపు మేరకు వర్తక సంగం వలిగొండ సంపూర్ణ బంద్ చేసినారు మార్వాడి వలన నాసిరకం దందాల వలన అన్ని కుల సంఘాల వ్యాపారాలను జువెలరీ ప్లాస్టిక్ ప్లంబర్ అన్ని రకాల వ్యాపారాలలో అతి తక్కువ ధరలకు అమ్మడం వలన నష్టపోతున్నారు అందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు వలిగొండలో కూడా బందు నిర్వహించారు అన్ని దుకాణదారుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## హన్మాపురం బ్రిడ్జిపై గుంతల మయంగా మారిన రోడ్డు

తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణం శుక్రవారం రోజున డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భువనగిరి నుండి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ సిద్దిపేట వైపు వెళ్లే ప్రధాన రహదారి హన్మాపురం వద్ద బ్రిడ్జిపై గుంతల మయంగా మారిన రోడ్డును పరిశీలించి నిరసన వ్యక్తం చేసిన డివైఎఫ్ఐ నాయకులు.



## ఆగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఆధ్వర్యంలో పీఎం కిసాన్ ఫార్మర్ రిజిస్ట్రేషన్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ రైతు వేదికకు పీఎం కిసాన్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించు కొనుటకు 11 మంది రైతులు శుక్రవారం రోజు హాజరైనారు. వారికి భూ చట్టాలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మండల లీగల్ సర్వీస్ అథారిటీ గురించి టోల్ ఫ్రీ నెంబర్ 15100 గురించి రైతులకు ఉచిత సలహాలు సూచనలు పారాలిగల్ వాలెంటర్ కానుగంటి శ్రీశైలం వివరించడం జరిగింది.

## మార్వాడీ గో బ్యాక్.. లోకల్ వ్యాపారుల నిరసన



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో,ఆగస్టు 22:** మార్వాడీ గో బ్యాక్ కు మద్దతుగా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో వ్యాపారుల దుకాణాల బంద్, నిరసన ర్యాలీ. మోత్కూర్ వ్యాపారాన్ని మార్వాడీ వ్యాపారులు ఆక్రమించడంతో లోకల్ వ్యాపారులు దెబ్బతింటున్నారని, స్థానిక యువతకు ఉపాధి లభించడం లేదని, షాపుల అద్దెలను మార్వాడీ వ్యాపారులు ఇష్టానుసారంగా పెంచుతున్నారని లోకల్ వ్యాపారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చేందుతున్నారు.

## ఉపాధి హామీ పనుల జాతర పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామ పంచాయతీలో శుక్రవారం రోజు నిర్వహించిన ఉపాధి హామీ "పనుల జాతర" కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జీ సృజన, కలెక్టర్ ఎం హనుమంతరావు. అంతకుముందు గ్రామసభ నిర్వహించి అత్యధిక వేతన రేటు సాధించిన ఉపాధీ కార్మికులు,గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లను సన్మానించిన అధికారులు.

## ఆత్మకూర్ ఎం మండలకేంద్ర వర్తక వ్యాపార సంఘం ఎన్నిక



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం రోజున మండల కేంద్రలోని వ్యాపారాలు నిర్వహించే వ్యాపారస్తులు వర్తక వ్యాపార సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బొబ్బల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా చెరుకు విష్ణు, ప్రధాన కార్యదర్శిగా పైళ్ళ దామోదరరెడ్డి, కార్యదర్శిగా శామకూర శివకుమార్,సోషల్ మీడియా కన్వీనర్ గా బూడిద శేఖర్, కార్యవర్గ సభ్యులుగా లోడి నరేష్,నల్ల నర్సయ్య, రంగ శేఖర్, అంబోజి శీను, నంగునూరు బ్రహ్మచారి, వంగరి ఋషి, పంజాల రామకృష్ణ,లోడి శ్రీనివాస్, ఎస్.కె జామియా, అఫ్జల్ ,ముక్కి వినోద్, మాటూరు శంకర్, కొప్పుల శివప్రసాద్ రెడ్డి, ఎండి కాజా ,పైల ప్రశాంత్ రెడ్డి, పంగ కుమార్, నాగన్న, నర్సిరెడ్డి, తోటకూరి శేఖర్ ,ఆత్మకూర్ వ్యాపారులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు(ఎం)మండల పరిధిలో ఉపాధి హామీ పనుల జాతర ప్రారంభ కార్యక్రమం





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల పరిధిలో ఉపాధి హామీ "పనుల జాతర ప్రారంభ కార్యక్రమం" శుక్రవారం రోజున ఘనంగా అన్ని గ్రామాలలో ప్రారంభమైంది. మండలాభివృద్ధి అధికారి జె రాములు నాయక్, పల్లెపహాడ్, కొరటికల్, ఆత్మకూరు గ్రామాలలో పాల్గొని లబ్ధిదారుల వద్ద పశువుల పాకాలు, కోళ్ల షెడ్లు, మేకల/గొర్రెల షెడ్లు, నాడెప్ కంపోస్ట్, ఇంకుడు గుంతల పనులు ప్రారంభించారు. మండలంలో మొత్తం:25 పశువుల పాకాల నిర్మాణం,5 కోళ్ల షెడ్ల నిర్మాణం,3 గొర్రెల/మేకల షెడ్ల నిర్మాణం,10 నాడెప్ కంపోస్ట్ యూనిట్లు,81మంది లబ్ధిదారులకు ఇంకుడు గుంతల పనులు మంజూరయ్యాయి. అదేవిధంగా గ్రామసభలు నిర్వహించి, ఉపాధి హామీ కార్యక్రమంలో విశేషంగా పనిచేసిన వికలాంగులు,గ్రామ పంచాయతీ సిబ్బంది,మొక్కలను సంరక్షించిన వ్యక్తులు సన్మానించబడ్డారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాములు నాయక్,ఏపీఓ బి రమేష్, ఈసీ ఎస్ శ్రీనివాస్,డి టీఏలు డి నిర్మల, జే యాదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు,లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**తొలి అక్షరం/యాదాద్రి బ్యూరో, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ల గ్రామంలో మారుపాక మల్లేశం మరణించినారు. వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 5000 రూపాయలు గ్రామ పెద్దలు బచ్చు రాధాకిషన్ శైలజ ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పల యాదవ్, గ్రామ శాఖ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎరుకల స్వామి గౌడ్, జనరల్ సెక్రెటరీ గడ్డం అశోక్, జిల్లా నాయకులు ఉప్పల నరసింహ, యూత్ మండల కార్యదర్శి నిమ్మన గోటి,గణేష్ విద్యార్థి విభాగం మండల కార్యదర్శి కూరెళ్ళ మణికుమార్, మండల నాయకులు మోతే యాదగిరి రెడ్డి, నాయకులు మోతే నందా రెడ్డి, నార్కెట్పల్లి ప్రేమ్ కుమార్, నార్కట్పల్లి ఐలయ్య, మారుపాక ముత్తయ్య,భాష బోయిన శంకరయ్య,ఉప్పల మహేష్, నార్కట్పల్లి స్వామి, బోయిని రాములు,నిమ్మల సత్తయ్య, మారుపాక అంజయ్య,కొంపెల్లి బిక్షం,సుదగాని సందీప్, కడెం శ్రీను,సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం,గ్రామ శాఖ కార్యదర్శి సోమనబోయిన నరసింహ,చంద్రయ్య, జెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మార్వాడి వ్యాపారుల గోబ్యాక్

### రామన్నపేటలో స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి నిరసన




**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** ఓయూ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా (మార్వాడి వ్యాపారుల గో బ్యాక్) పిలుపు మేరకు రామన్నపేట వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను శుక్రవారం నాడు మూసివేసి బంద్ పాటించారు. ఈ సందర్భంగా మండల వర్తక వ్యాపారుల సంఘం మండల అధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వర చారి మాట్లాడుతూ.. మార్వాడీలే అన్ని రకాల వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఎన్నో సంవత్సరాలుగా స్థానికంగా వ్యాపారాలు నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు మార్వాడీల వల్ల మా జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. మున్ముందు తమ వ్యాపారాలు కొనసాగుతాయో లేవోనన్న నమ్మకం కూడా కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఏ వహీదు, ఉపాధ్యక్షులు వనం బిక్షపతి, చోల్లేటి పాండురంగాచారి, తమ్మిశెట్టి సందీప్, మోటి బీరప్ప, ఊట్కూరి శ్రీను, షఫీ, సోహెల్, కామిశెట్టి రాంబాబు, గంజి నరేష్, మోటి నరేష్, నజీర్ టైలర్, గంగుల వెంకట్ రెడ్డి, ఎండి వహీద్ పాల్గొన్నారు.

## బీజేపీ వర్తకసంఘం ఆధ్వర్యంలో నూతన ప్రెస్ క్లబ్‌కు సన్మానం

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** నూతనంగా ఎన్నికైన రామన్నపేట ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని బీజేపీ మండల నాయకులు, వర్తక వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సంఘంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎటెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అప్పం చెన్నకేశ్వర్, ఉపాధ్యక్షులు నోముల శంకర్, కోశాధికారి శివరాత్రి రమేష్ లను వారు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తారని, సమస్యల పరిష్కరించడంలో పత్రికలు ప్రధాన భూమిక పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్, బిజెపి జిల్లా నాయకులు, వర్తక సంగం అధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వర చారి, వర్తక సంఘం కార్యదర్శి ఎం.డి వహీద్,నాయకులు కట్కూరి బిక్షం, కూనూరు సుధాకర్, సింధ%శీ% లింగయ్య, నకిరేకంటి సుదర్శన్, వహీద్, గురుకు శివ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**సంతాపూర్‌లో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం**

**కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి**

**కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వెంట గ్రామ నాయకులు**

**ఇలాంటి మహోత్సవాలలో పాల్గొనడం సంతోషదాయకం.... ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ రెడ్డి**





**తొలి అక్షరం/కేశంపేట, ఆగస్టు 22:** లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ పరిధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. పానకాల లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మాట్లాడుతూఇలాంటి పవిత్రమైన సందర్భాలలో పాల్గొనడం ఎంతో సంతోషదాయకమన్నారు.ఈ వేడుకలో భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కళ్యాణ మహోత్సవం లో పాల్గొని నరసింహస్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పానకాల లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో సంతపూర్ మాజీ సర్పంచ్ వరలక్ష్మి ప్రభాకర్ రెడ్డి, పాపిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, కాకునూరు మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల వెంకటేష్, సాజీద్, నరేందర్ రెడ్డి, కొత్తపేట జగన్ రెడ్డి, యాదయ్య గౌడ్, క్రిష్ణ, రజినీకాంత్ గౌడ్ గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ రక్షించుకోవాలి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం సీరోల్ లో మండల స్థాయి సధస్సు మహబూబాబాద్ జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కామ సంజీవ రావు అధ్యక్షతన జరిగిన సధస్సులో మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ప్రిన్సిపల్ ధర్మారపు గణేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఉండబడిన రాజ్యాంగల కంటే ఎంతో ఉన్నంతమయినది. రెండు సంవత్సరాల 18 నెలల 11 రోజులు రాసి ఆమోదించుకోవడం జరిగింది. భారతదేశంలోనీ ప్రజలకు సమాన హక్కులు కల్పించ బడింది.ఈ రాజ్యాంగం ధ్వారానే మాట్లాడే హక్కు, జీవించే హక్కు కల్పించబడింది. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. ప్రతి గ్రామానికి, ప్రతి వాడకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా భారత రాజ్యాంగ రక్షణ సధస్సులలో పాల్గొనాలని కోరారు. ఎలక్ట్రికల్ డి ఇ విజయ్, తహసిల్దార్ పూర్ణం చందర్,పాల్గొని ప్రతి ఒక్కరు రాజ్యాంగ రక్షనకీ పాటు పడాలని కోరారు. భారత రాజ్యాంగమె లేకపోతే ఆఫ్రికా దేశాలు ఏ విధంగా అయితే అంతర్ యుద్ధలతో శతమాతమవుతున్నాయో మనం కూడా అలాంటి పరిస్థితి వచ్చేది. ప్రతి ఒక్కరు రాజ్యాంగ రక్షణకై పాటు పడాలి. ఈ కార్యక్రమలో తప్పట్ల వీరన్న రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎలక్ట్రికల్ ఏ ఇ సునీల్ కుమార్, ప్రతాపని బిక్షమయ్య, ప్రతాపని పుల్లయ్య, నీరుడు సామేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహబూబాబాద్, నీలకంఠ ఉపేందర్, ఇనుగుర్తి ప్రశాంత్, తగరం శ్రీరామ్, ఆలేటి రవి, మాచర్ల నరేష్, ఆలేటి సాగర్, దుడ్డేల మల్లయ్య, గొల్ల తిరుపతయ్య, మెరుగు రమేశ్, మీడతపల్లి అరవింద్, జినక పరమేష్, ఆకారపు రాము, సదినం లక్ష్మయ్య, సదినం సైదులు, తగరం సురేశ్, వెంపటి రమేష్, కనకం బాబు, మునిగంటి వెంకన్న, పంజా అరుణ్, గవిని వెంకన్న, మక్కల వీరన్న, అందోని రాజు, మందడి శ్రీకాంత్, కుమ్మరి భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మద్యం పాలసీని సవరించాలి....

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2025 సంవత్సరము ఎక్సైజ్ పాలసీని ప్రకటించడం జరిగింది అని అట్టి పాలసీలో మార్పు చేయవలసిన అవసరం ఉన్నాదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు అన్నారు. తేదీ 22.08.2025 శుక్రవారం రోజున రామన్నపేట పట్టణ కేంద్రంలో జరిగిన కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశాము సంఘం మండల అధ్యక్షులు ఎర్ర రవీందర్ గారి అధ్యక్షతన జరిగింది. యిట్టిసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జయరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు తమ ఎన్నికల మేనిఫెస్టోలో గౌడ గీత కార్మికులకు వైన్స్ షాపులలో 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మాట ఇచ్చారని ఇప్పుడు ప్రకటించిన ఎక్సైజ్ పాలసీలో 15% మాత్రమే ఉన్నదని ఇది ప్రభుత్వం మాట తప్పడమేనని ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎక్సైజ్ పాలసీ ని సవరించి గౌడగీత కార్మికులకు వైన్స్ షాపులలో 25 శాతం కేటాయించి ధరావత్ 3 లక్షల రూపాయలు కట్టడం లేకుండా షాపులను మండల యూనిట్ గా కల్లు గీత సొసైటీలకు లాటరీ పద్ధతిలో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని దానివల్ల పేద గీత కార్మికులకు వారి కుటుంబాలకు ఉపయోగం జరుగుతుందని అన్నారు. కానీ గౌడులకు కేటాయించిన వైన్స్‌లో ధరావత్ 3 లక్షలు రూపాయలు పెట్టడం వల్ల గౌడ ధనిక కుటుంబాలకు మాత్రమే లాభం జరుగుతుందని పేద గౌడ గీత కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రభుత్వం అనుకున్నా లక్ష్యం కూడా నెరవేరదని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు రాగిర్ కృష్ణయ్యా గారు మాట్లాడుతూ జిల్లాలో వృత్తిలో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని వృత్తి చేస్తున్న గీత కార్మికులందరికీ తక్షణమే కాటమయ్య రక్షణ కవచాలను అందించాలని. పెండింగ్ ఎక్స్ గ్రెషియా లకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికాలను కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు,జిల్లా ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు,, జిల్లా నాయకులు కూనూరు మల్లేశం,మండల కోశాధికారి మునుకుంట్ల లెనిన్, గంగాదేవి అంజయ్య, సూర్వి ఎల్లయ్య, పాలకూర్ల యాదయ్య,పల్సం కనకయ్య,ఆకిటి శ్రీనివాస్, పాలకూర అంజయ్య పాలకుర శీనులు పాల్గొన్నారు.

# మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడల నిర్వహణ సమావేశం




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం శుక్రవారం రోజున 69 వ మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) క్రీడల నిర్వహణ సమావేశం మండల విద్యాధికారి కే మహాదేవ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఇట్టి సమావేశంలో మండల స్థాయి పాఠశాల క్రీడలు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ ఈ నెల 28మరియు 29తేదీలలో నిర్వహించాలని నిర్ణయించినారు.28న అండర్ 14 మరియు 17 బాలికలకు మరియు 29 న అండర్ 14 మరియు17 బాలురకు మండల స్థాయిలో సెలెక్షన్స్ స్థానిక పాఠశాల జిప ఉపా ఆత్మకూరు(ఎం) ప్రాంగణంలో జరుగును.ఈ ఆటలలో పాల్గొనే విద్యార్థులు అందరూ తప్పనిసరిగా బోనాఫైడ్ సర్టిఫికేట్ తీసుకొని రావాలి. అండర్ 14 లో పాల్గొనే విద్యార్థులు 01.01.2012 తర్వాత జన్మించి ఉండాలి.అండర్ 17 పోటీలలో పాల్గొనే విద్యార్థులు 01.01.2009 తరువాత జన్మించి ఉండాలి. అండర్ 14 కబడ్డీలో పాల్గొనే బాలురు 51 కేజీలు, అండర్ 14 బాలికలు 48 కిలోల లోపు బరువు కలిగి ఉండాలి.అండర్ 17 కబడ్డీలో పాల్గొనే బాల బాలికలు 55 కిలోల లోపు బరువు కలిగి ఉండాలి. ఇతర వివరాలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ దుగ్యాల ఇందిరా ప్రియ(8886861128) వ్యాయామ ఉపాధ్యాయులుని సంప్రదించాలని మండల విద్యాధికారి కె.మహా దేవ రెడ్డి తెలియజేశారు.వ్యాయామ ఉపాధ్యాయులు జెట్ట రవీందర్, అరే రామంజమ్మ, ఆలకుంట్ల స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన గాలి కోసం మా బాధ్యతగా కృషి చేస్తున్నము

● పర్యావరణ జాతీయ అవార్డు గ్రహీత.... దైద హర్షిత్.



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఎన్జీవో కాలనీకి చెందిన టీచర్ కొమిరె ఉప్పాలయ్య పుట్టిన రోజు వేడుకలో వారికి శుభాకాంక్షలు తెలిపి అనంతరం మొక్కను బహుకరించిన పర్యావరణ జాతీయ అవార్డు గ్రహీత దైద హర్షిత్,హర్షిత,హర్షిక. హర్షిత్ మాట్లాడుతూ మా నాన్న నిరంతరం మొక్కలు నాటడం వల్ల మాకు కూడా చిన్నతనము నుంచే పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాము. అందుకే మా ఇంటికి వచ్చిన వారికి మొక్కలు ఇచ్చే అలవాటు అయింది.ఇలా చేసినందుకు గాను నేను 3వ తరగతి చదువుతున్నప్పుడే నాకు జిల్లా చైల్డ్ లైన్ అవార్డు ఇచ్చారాని అలాగే నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ కూడా 2024లో పర్యావరణ జాతీయ అవార్డు,హై కోర్ట్ జడ్జి,జబ్బర్దస్తి శేషు చేతులమీదుగా ఇచ్చారని తెలిపారు.ఇప్పటి వరకు మా ఇంటికి వచ్చిన వారికి 15 వేలకు పైగా మొక్కలు ఇచ్చామని అన్నారు. ఎస్పీ చంద్రమోహన్,వన్యప్రాణి సంరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యులు రవి కుమార్.టీచర్స్,ప్రజలతో కలసి మొక్కలు నాటమని తెలిపారు. సంఘమిత్ర గౌరవ అధ్యక్షులు.వేల్పుల వీరాస్వామి,గుడేల్లి నాగయ్య,క కుక్కల ఉప్పలయ్య,కార్యదర్శి జలగం వీరాస్వామి.కోశాధికారి దోసపాటి మల్లన్న. ప్రచార ఇంచార్జీ శంకరయ్య పాల్గొన్నారు.

# గ్రామాల్లో పనుల జాతరతో ప్రగతి పరుగులు: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

● అన్నారం పనుల జాతర కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ● అంగన్వాడి, మహిళా సంక్షేమ భవనాల నిర్మాణాలకు స్థానిక నాయకులు అధికారులతో కలిసి శంకుస్థాపన



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 22:** గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమాల ద్వారా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రగతి పథంలో పరుగులు పెట్టనున్నాయని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం గల సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా ఫరూక్ నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పనుల జాతర కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. శుక్రవారం ఎంపీడీవో బన్సీలాల్ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్వాడి, మహిళా సంక్షేమ భవనాల నిర్మాణాలకు స్థానిక నాయకులు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సామూహిక ఇంకుడు గుంతను ప్రారంభించారు. అనంతరం మల్టీపర్పస్ వర్కర్లను, వందరోజుల ఉపాధి హామీ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని, నిధుల ఆటంకాలు ఎన్ని ఎదురైన వాటన్నింటిని అధిగమిస్తూ ప్రజా పాలనను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత పాలకులు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. కమిషన్ల కోసం కాలేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత ప్రమాణాలను పట్టించుకోలేదని, అందువల్లే అనిత కాలంలోనే ప్రాజెక్టు కుంగిందని, కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని ఎవరిని కాంగ్రెస్ ప్రభుత్వం విడిచిపెట్టదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి యూరియా అందించడంలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

● సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య.. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైతాంగానికి సరిపడా యూరియా ఇవ్వాలని బ్లాక్ మార్కెటు అరికట్టాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి పార్టీ జిల్లా నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా కామ్రేడ్ గౌని ఐలయ్య, కామ్రేడ్ మండల వెంకన్నలు ప్రసంగిస్తూ రాష్ట్రంలో యూరియా కొరతతోనే రైతాంగం అనేక ఇబ్బందులు పడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కబెడుతున్నాయని అన్నారు.రాష్ట్రానికి 9 లక్షల మెట్ల మెట్రిక్ టన్నుల యూరియా అవసరము ఉండగా కేవలం 3 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా జరిగిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం తో దోబూచలాడుతున్నారని, ఇవాళ యూరియా కొరత వల్ల వరి, పత్తి మొక్కజొన్న, ఆహార పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు.రాష్ట్రంలో మంత్రులు యూరియా కొరతలేదని ఇబ్బడి ముబ్బడిగా ఉన్నదని అంటున్నా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని చెబుతున్నారు. ఇవన్నీ కూడా రైతాంగాన్ని మోసపుచ్చటం తప్ప మరొకటి కాదని అన్నారు. యూరియాను ప్రభుత్వ మద్దతుతోనే బ్లాక్ మార్కెట్ చేశారని ఎకరానికి ఒక కట్ట, ఐదు ఎకరాలకు రెండు కట్టలు అని చెప్పి మంత్రులు ప్రకటిస్తున్నారని ఎకరా ఎకరానికి మూడు కట్టలు అవసరం అన్నారు. యూరియా కోసం రైతులు చేకోర పక్షుల్లాగ వేచి చూస్తున్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు వ్యవసాయ రంగం పట్ల వివక్షత విడనాటి మందు కట్టలు ఇవ్వాలని అన్నారు. రైతాంగం కోరుతున్నది యూరియా కట్టలని అవసరం లేనటువంటి నానో యూరియా అధిక రేటుకు అంట పెట్టడం సరికాదని అన్నారు వ్యవసాయ శాఖ దృష్టి పెట్టి బ్లాక్ మార్కెట్ జరగకుండా సొసైటీ, వ్యాపారస్తుల ద్వారా యూరియా అందించాలని అన్నారు.ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి ఐలయ్య, జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, మోకాల మురళీకృష్ణ, హలావత్ లింగ్యా, శ్రీధర్, సక్రు,యాకన్నా, బట్టు చైతన్య, బోనగిరి మధు, చారీ హారీష్, గజ్జి లింగన్న, ఎస్ కే బాబు, తోకల వెంకన్న, చింత వెంకన్న, డివిజన్ నాయకులు పాపయ్య, పర్వత కోటేష్ తాజ్ పాషా, కోటం అంజయ్య, ఏపూరి వీరభద్రం, గౌని భద్రయ, గణేష్, పొన్నం రమ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు పతకం, నగదు పురస్కారాన్ని అందుకున్న షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు

వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించిన హైదరాబాద్ సిపి ఆనంద్.



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 22:** విధులలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లకు హైదరాబాద్ సిపి ఆనంద్ శుక్రవారం బంగారు పతకం, నగదు పురస్కారాన్ని అందజేశారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జ్ఞాపకార్థం ఎడ్యుకేషనల్ సొసైటీ తన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక బంగారు పతకాన్ని, నగదు పురస్కారాన్ని అందించడం తనకు గౌరవంగా, ఆనందంగా ఉందని డిఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ బంగారు పథకాన్ని అందుకోవడంలో తన ఉన్నతాధికారుల మార్గదర్శకలను పాటించి, వారి సూచనల మేరకు విధులను నిర్వహించడం వల్లే తనకు సాధ్యమైందని ఆయన తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ అవినాష్ మహంతి ఐపీఎస్, అధికారులు శంషాబాద్ డిసిపి రాజేష్, శంషాబాద్ అడిషనల్ డిసిపి, షాద్‌నగర్ ఏసీపి లక్ష్మీనారాయణ, షాద్‌నగర్ సీఐ విజయ్ కుమార్ లకు డిఐ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కంసాన్ పల్లి ఘనంగా బోనాల ఉత్సవాలు

● ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్

● అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలి... వై. రవీందర్ యాదవ్



**తొలి అక్షరం/ఫరూఖ్ నగర్, ఆగస్టు 22:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ అన్నారు. ఫరూఖ్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామంలో శుక్రవారం మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ పర్వదినాలలో ముఖ్యంగా ఆషాడం, శ్రావణ మాసాలలో తెలంగాణ ప్రజలు జరుపుకునే బోనాల ఉత్సవాలు ప్రత్యేకమని, గ్రామ దేవతలను పూజిస్తే సకల శుభాలు కలుగడంతో పాటు పాడి పంటలు పుష్కలంగా పండుతాయి అని అభిప్రాయపడ్డారు. గ్రామంలో వర్గాల ప్రజలు బోనాల ఊరేగింపులో పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, నాయకులు వీరేశం గుప్తా, వెంకట్ రెడ్డి, యాదయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, చందు నాయక్, బాలరాజు, వెంకటయ్య, తోట్ల బాలరాజ్, రామకృష్ణ రెడ్డి, మల్లేష్, శివ, వడ్డే కృష్ణ, హనుమంతు, మొయినోద్దీన్, ఆవ జంగయ్య, నర్సింలు గౌడ్, మల్లేష్ గౌడ్, ఆవ కృష్ణ, వడ్డే యాదయ్య, చెన్నయ్య గౌడ్, రమేష్, గణేష్ గౌడ్, సత్యం, శివకృష్ణ, మిద్దె కృష్ణ, మహేష్ గౌడ్, గొడుగు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కుల పంపిణీ





**తొలి అక్షరం/నరసింహులపేట ఆగస్టు 22:** మండలంలోని కౌసల్యదేపల్లి గ్రామం లో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో 10మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. లక్షల విలువల గల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే రామచంద్రనాయక్.మండల అధ్యక్షులు రమేష్ ఆదేశాల మేరకుసంజయ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేసినట్లు గ్రామ పార్టీ అధ్యక్షులు చల్ల మధు రెడ్డి అనంతరం ఆయన మాట్లాడారు. ఆపద కాలంలో ఆరోగ్యశ్రీలో లేని చికిత్సలతో పాటు చికిత్సలకు ప్రజలు చెల్లించిన బిల్లులను సీఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో సీఎం సహాయనిధి ధ్వారా లక్షలాది రూపాయ ల ను బిల్లులను లబ్దిదారులకు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే సీఎంకు ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి సన్మానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు లబ్ధిదారులు పాటు తదితరులు పాల్గొన్నారు

# యూరియా బస్తాల కోసం నంగారభేరి రైతులతో కలిసి రాస్తారోకో





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** మహబూబాబాద్ పట్టణంలోని పిఎసిఎస్ ఆఫీస్ ముందు రైతులకు యూరియా బస్తాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు.కంకర బోర్డ్ ప్రధాన కూడలి రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపుగా రెండు గంటలకు పైగా రాస్తారోకో నిర్వహించడంతో మహెూబాద్ పట్టణంలో అనేక వాహనాలు బారులు తిరిగాయి.ఎల్ హెచ్ పి ఎస్ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా తక్షణమే రైతులకు యూరియా అందించాలని రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకులు, రైతులకు మద్దతుగా ఎల్ హెచ్ పి ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బోడ లక్ష్మణ్ నాయక్,జిల్లా అధ్యక్షులు అంగోత్ చందులాల్,అర్బన్ జిల్లా అధ్యక్షులు మూడు రవి నాయక్, మండల అధ్యక్షులు అజ్మీరా శ్రీనివాస్,బాలరాజులు నాయకత్వంలోజరిగింది. పెద్ద ఎత్తున రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. స్పందించిన జిల్లా జెడిఎ, డిసిఓ, సంఘం నాయకులుతో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పటల్ సర్వీసెస్ పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చింత రమేష్

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** డాక్టర్ చింత రమేష్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పటల్ సర్వీసెస్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వం కలిసి శాలవతో సత్కరించి, పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ ఉద్యమకారుడు ఎండి వహీద్, పాత్రికేయులు తొలి అక్షరం మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జ్ అంబాల కుమార్, ఉదయ్ అక్షరం మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి తక్కలపల్లి శ్రీనివాస్.



# విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలి

### - విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ గోపాలచారి

**తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు22:** విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ గోపాలచారి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొమ్ములవంచ 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్ర కార్యాలయంలో నేడు నర్సింహులపేట,మరిపెడ, చిన్నగూడూరు మూడు మండలాల సెక్షన్ల పరిధిలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యుత్ పునరుద్దరణలో భాగంగా కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లు మార్చడం,వొల్టేజి హెచ్చు తగ్గులు డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం నూతన సర్వీసులు మంజూరు చేయడం,అదనపు లోడు క్రమబద్ధీకరణ,సర్వీసు పేరు మార్చడం,విద్యుత్ వాడకం కన్నా పెద్ద మొత్తంలో బిల్లులు రావడం,కేటగిరిలో మార్పు సర్వీసు రద్దు మొదలగు వాటికి సంబంధించిన సమస్యలను దరఖాస్తు రూపంలో ఇవ్వాలని తెలిపారు. టెక్నికల్ మెంబర్ రమేష్,ఫైనాన్స్ దేవేందర్,ఇండిపెండెంట్ మెంబర్ రామారావు, నరసింహుల పేట మరిపెడ ఎల్లంపేట చిన్న గూడూరు సెక్షన్ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం సభ

**తొలి అక్షరం/గంగాధర ఆగస్టు 22:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు గంగాధర మండలం గట్టు బూత్కూరు అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించనైనది. ఈ సందర్భంగా సిడిపిఓ నరసింగ రాణి మాట్లాడుతూ తల్లులకు పిల్లలకు పోషకాహారం, ఆరోగ్యం గురించి మరియు బాలామృతం గురించి వివరించి చెప్పినారు, బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పిల్లలను తప్పకుండా ఎన్ ఆర్ సి కి పంపించాలని చెప్పినారు, ఆరోగ్య మహిళా ప్రోగ్రాం గురించి వివరించనైనది, గర్భవతులు బాలింతలు పిల్లలు అందరూ తప్పకుండా అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలని చెప్పినారు, ఈ సందర్భంగా గర్భవతులకు శ్రీమంతాలు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించినైనది, ఈ కార్యక్రమంలో నర్సింగరాణి , సూపర్వైజర్ రేణుక, డాక్టర్ శిరీష, సెక్రటరీ పవన్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ నయీమ్ రాజ్య లత, సఖి సెంటర్ పద్మావతి, శైలజ, అంగన్వాడీ టీచర్లు అనంతలక్ష్మి, సరోజ, రజిత తల్లులు మరియు పిల్లలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనం అప్పగించడం లేదని ఎమ్మెల్యేకి వినతి

**తొలి అక్షరం/చిట్యాల ఆగస్టు 22 :** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం మూడు సంవత్సరాల క్రితం 20 లక్షలతో నిర్మించి ప్రారంభించినప్పటికీ అంబేద్కర్ సంఘానికి ఆ భవనం అప్పగించడం లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారికి అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది అంబేద్కర్ సంఘానికి అంబేద్కర్ అభిమానులకి అంబేద్కర్ వాదులకి మండల ప్రజలకి ఉపయోగంలో ఉండాల్సిన అంబేద్కర్ భవనం నిరుపయోగంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో శనిగరపు మొగిలి, గడ్డం సదానందం, పాము కుంట్ల చందర్, గుర్రం రాజమౌళి, గుర్రం శంకర్. తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 31లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలి

### - జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ బి.వినోద్ కుమార్

**తొలి అక్షరం/పెద్దపల్లి, ఆగస్టు 22:** ఆగస్టు 31, 2025 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువుల కై అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ బి.వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు (ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన/చివరి సంవత్సరం చదువుతున్న) వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, జర్మనీ జపాన్, సింగపూర్, సౌత్ కొరియా, మొదలగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్ళేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థి పీజీ చదివేందుకు గ్రాడ్యుయేషన్ లో 60% కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షల రూపాయల లోపు ఉండాలని , టోఫెల్ జి.ఆర్.ఈ. జి మ్యాట్ లలో అర్హత కలిగి ఉండడంతో పాటు పాస్ పోర్ట్ కలిగి ఉండి విదేశీ విద్యాలయంలో ప్రవేశం పొంది ఉండాలని తెలిపారు . ఆసక్తి గల పెద్దపల్లి జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు https://telanganaepasscbbgov.in ద్వారా ఆగస్టు 31 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఉప సంచాలకులు ఎస్సీ అభివృద్ధి శాఖ , బి.వినోద్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ట్యాంక్ బండ్ పై షోయబుల్లాఖాన్ విగ్రహం పెట్టాలి: జర్నలిస్ట్ కేపీ డిమాండ్..

**షాద్ నగర్‌లో ఏర్పాటుకు తాను సిద్ధమని ప్రకటన.**

**షాద్ నగర్‌లో టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్‌కు ఘన నివాళి**

**టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్ నరేష్ నేతృత్వంలో ఘన నివాళి**




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 22:** నిజాంపై అక్షర పోరాటం చేసి తన రెండు చేతులను పోగొట్టుకున్న మహనీయుడు, ఆదర్శాల కోసం విలువైన ప్రాణాలను అర్పించి జర్నలిస్టులకు ఆదర్శ ప్రాయుడైన షోయబుల్లాఖాన్ విగ్రహాన్ని ట్యాంకుబండు మీద ఏర్పాటు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు జర్నలిస్ట్ ఎండి ఖాజాపాషా (కేపీ) డిమాండ్ చేశారు. షాద్ నగర్ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థలాన్ని కేటాయిస్తే తన సొంత ఖర్చుతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నిజాం పోరాట యోధుడు, జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ 77వ వర్ధంతిని పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణ కూడలిపై షాద్ నగర్ టిడబ్ల్యూజేఎఫ్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్ నరేష్ ఆధ్వర్యంలోస్థానిక జర్నలిస్టులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ అక్షర పోరాటం చేసిన షోయబుల్లాఖాన్ జర్నలిస్టులకు ఆదర్శమని ప్రశంసించారు. అలాంటి మహనీయుడికి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ చరిత్రలో గుర్తుంచుకోవలసిన జర్నలిస్టులు కొందరే ఉన్నారని అలాంటి వారిలో షోయబుల్లాఖాన్ ముందువరుసలో ఉంటారని ప్రశంసించారు. ఆయన ఆదర్శంగా ప్రతి జర్నలిస్టు నిజాయితీగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వం నుంచి ప్రజలను కాపాడేందుకు తన రెండు చేతులను పోగొట్టుకున్న షోయబుల్లాఖాన్ ను చరిత్ర ఇప్పటికీ మర్చిపోతున్నారనీ జర్నలిస్టులు లక్కాకుల రమేష్ కుమార్, కస్తూరి రంగనాథ్, నరసింహారెడ్డి, అప్సర్, సురేష్, రాకేష్, సాయినాథ్ రెడ్డి, కృష్ణ, జగన్, మహేష్, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పోరాటానికై బీజేపీ ముందడుగు

● భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్



**తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు22:** ప్రజా సమస్యల పోరాటానికై బిజెపి పోరాడుతుందని భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మేరేటి సురేందర్,భాజపా డోర్నకల్ ఇన్చార్జి భూక్య సంగీత నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల మీద తహశీల్దార్ రమేష్ బాబు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలోని గ్రామాల్లో పారిశుద్ధ పనులు లోపించాయని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కుంభం అశోక్ రెడ్డి,భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ గండి రమేష్ గౌడ్,మండల ఉపాధ్యక్షుడు నెలకుర్తి సత్యనారాయణ,మండల జనరల్ సెక్రటరీ ఎరనాగి కుమార స్వామి,బీజేవైఎం యూత్ ప్రెసిడెంట్ పొడుపుగంటి అంజి,మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్ర నితీష్,బూత్ అధ్యక్షుడు బానోత్ రమేష్,కార్యదర్శి ప్రేమ్,మనోజ్,దిలీప్,యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# చావు కాదు...రేవు చేరుకో

● జీవితం జీవించడానికే, ఆత్మహత్యల కోసం కాదు ● ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి ● ఆరోగ్యమిత్ర సంస్థ కృషికి అభినందనలు ● ఆధ్యాత్మిక, యోగా మార్గాల ద్వారా పరిష్కారం ● ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత ● డాక్టర్ పరికిపండ్ల అశోక్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి,(పి.సైదులు),ఆగస్టు22:** జీవితం జీవించడానికే, ఆత్మహత్యల కోసం కాదని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన సదస్సులో డాక్టర్ అశోక్ ప్రసంగించారు. కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని,వైఫల్యాలను పట్టించుకోకుండా,ఆత్మహత్య ఆలోచనలను విడిచిపెట్టి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగినప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడని ఆయన అన్నారు. ఆత్మహత్య ప్రయత్నం చేసే వ్యక్తుల పట్ల సమాజం సానుభూతితో వ్యవహరించి, వారికి మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. "నాకు ఎవరూ లేరు" అనే భావనను తొలగించి వారికి భరోసా కల్పించాలని చెప్పారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి అన్ని దారులు మూసుకుపోయినప్పుడు మాత్రమే ఆత్మహత్య అనే దారి తెరుచుకుంటుందని, అలాంటి ప్రమాదకర క్షణంలో "మేమున్నాం" అని భరోసా ఇస్తే వారు ఆ ప్రమాదం నుండి బయటపడతారని వివరించారు. రైతులు తాము పండించిన పంటకు సరైన ధర లభించకపోవడం, అప్పుల బాధతో ఆత్మాభిమానాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆత్మహత్యల నివారణకు కృషి చేసి, ఇప్పటివరకు 28 మంది జీవితాలను కాపాడటం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో ఆత్మహత్యల నివారణ మార్గాలు,జీవితంలో ఎదురయ్యే సంఘర్షణలు,వాటికి ఆధ్యాత్మిక యోగా వంటి పరిష్కార మార్గాలపై ఆయన వివరంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆత్మహత్యలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, రైతుల చేత ఆత్మహత్యలు చేసుకోబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్,ఆరోగ్యమిత్ర ప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.




# ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

● విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్






**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** శుక్రవారం మహబూబాబాద్ మండలం, రెడ్యాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల తరగతి గదులను,చుట్టూ పరిసరాలను,టాయిలెట్స్ పరిశీలించి వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల పై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యార్థుల యొక్క గదులను,వంటగదిని, డైనింగ్ హాలును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరగతి గదిలో విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు విద్యను అభ్యసించడంలో మెలుకువలు నేర్చుకోవాలని అన్నారు. టీచర్స్ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# షాద్ నగర్‌లో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు

● చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన షాద్నగర్ చిరంజీవి తాలూకా అభిమాన సంఘం

● కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేసిన అధ్యక్షుడు జై శ్రీహరి రాజు, అభిమానులు




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 22:** ఎవ్వరి ప్రోత్సాహం లేకుండా చలనచిత్ర సినిమా రంగంలో తన కాళ్ళపై తాను నిలబడి, తన నటనతో, అద్భుతమైన డాన్స్ స్టెప్పులతో, కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఏకైక నాయకుడు మెగాస్టార్ చిరంజీవి. తెలంగాణ చలనచిత్ర రంగం కూడా అభిమానిస్తున్న ఏకైక నాయకుడు కూడా చిరంజీవి. అలాంటి తమ మెగాస్టార్ జన్మదినం అంటే మెగాస్టార్ అభిమానులకు హద్దులు లేని ఆనందం ఉంటుంది. అలాంటి ఆనందాన్ని పంచుకోవడానికి ఈరోజు మన షాద్ నగర్ పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి తాలూకా అభిమాన సంఘం అధ్యక్షుడు జే. శ్రీహరి రాజు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ పుట్టినరోజు వేడుకల కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి అభిమానులందరూ హాజరయ్యి పట్టణ ప్రభుత్వ దవాఖాన లో కేక్ కట్ చేసి మెగాస్టార్ పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా తమ అభిమాన చలనచిత్ర నాయకుడు మెగాస్టార్ చిరంజీవి పై ఉన్న అభిమానంతో ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు, బ్రెడ్లు పండ్లు పంపిణీ చేసి మెగాస్టార్ పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తాలూకా చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు జే. శ్రీహరి రాజు మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంతకాలం మెగాస్టార్ ఎప్పుడూ మెగాస్టార్ అని, మెగాస్టార్ చిరంజీవి ని మించిన నటుడు ఇంకొకరు రారని, మెగాస్టార్ చిరంజీవి అభిమానులుగా ప్రతి సంవత్సరం పుట్టినరోజు పండుగలు ఇలాగే ఆనందంగా సంతోషంగా జరుపుకుంటామని అన్నారు. మెగాస్టార్ జన్మదిన సంబరాలలో చిరంజీవి తాలూకా అభిమాన సంఘం అధ్యక్షుడు జే.శ్రీహరి రాజు, ఆశన్న గారి భుజంగారెడ్డి, ఎం. బిక్షపతి, ఆర్ఎన్. రవీందర్, వై పరమేశ్వర్, ఏ శ్రీనివాస్ గౌడ్, పి బాలరాజు, బి శ్రీనివాస్, సి ఉదయ్, బి యాదయ్య, శేఖర్, శ్రీను పర్వేజ్ పి వేణు, ఏ యాదగిరి, శివ తదితరులు పాల్గొన్నారు.

# పింగళి రాజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఈగ మల్లేశం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు22:** అనారోగ్యంతో మృతి చెందిన పింగళి రాజిరెడ్డి పార్థివ దేహానికి కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం నివాళులర్పించారు. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పింగళి రాజిరెడ్డి అనారోగ్యం తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మృతుడి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ....రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పింగళి రమేష్ రెడ్డి,లెక్కల వాసుదేవ రెడ్డి, కరిమిళ్ల సంపత్ రావు,జన్నపురెడ్డి దేవేందర్ రెడ్డి, నర్సింహ రెడ్డి,మేరుగు ఎల్లా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కాటారం బిజెపి నాయకుల అక్రమ అరెస్ట్

● బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్ రెడ్డి



**తొలి అక్షరం/కాటారం ఆగస్టు 22:** మార్వాడీ గో బ్యాక్ నీ ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ సెక్రటరీయటి ముట్టడి పిలుపునివ్వడం జరిగింది కాటారం బిజెపి నాయకులను ఉదయం 06-00 గం.ల ప్రాంతంలో కాటారం పోలీసులు మా ఇంటికొచ్చి ముందస్తు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్ రెడ్డి ఉన్నారు.భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 'గో బ్యాక్ మార్వాడి' అనే నకిలీ ఉద్యమం నడుస్తుందని ఇది ఒక వర్గం వారిని ప్రోత్సహించి వారి ఓటు బ్యాంకు కొరకు ప్రత్యేకించి హిందువులను విడదీయాలనే కుట్రలో భాగంగా చేస్తున్నారని ఇందులో హిందువులెవరు బాధితులు కావద్దని తెలిపారు. అదేవిధంగా ఈ దేశం మన అందరిదీ అని ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా కులాలు, మతాలకతీతంగా ఉద్యోగాలు కానీ వ్యాపారాలు గాని చేసుకోవచ్చని ఇది రాజ్యాంగం మనందరికీ కల్పించిన హక్కు అని చెప్పారు. దీనిని ప్రశ్నించినందుకు బిజెపి నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమని, అలాగే రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని బిజెపి కార్యకర్తలను భయపెట్టాలని చూస్తుందని, ఇది ఎన్నాళ్లో కొనసాగదని ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యంలో ఏదో ఒక రోజు ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని అన్నారు.

# సైబర్ నేరాల చేదనకై సైబర్ వారియర్స్‌కు శిక్షణ కార్యక్రమం



**తొలి అక్షరం/గద్వాల్ ఆగస్ట్ 22:** జోగుళాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ శిక్షణలో సైబర్ క్రైమ్ మోసాలకు గురైన బాధితులకు భరోసా కల్పించడం, వారి తరపున ఫిర్యాదు నమోదు చేయడం, నేరగాళ్ల అకౌంట్లను ఫ్రీజ్ చేయించడం, ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కోర్టుకు పంపించడం, రిఫండ్ ఆర్డర్ పొంది బాధితుల ఖాతాల్లోకి అమౌంట్ జమ చేయించడం వంటి అంశాలపై మార్గదర్శకత్వం ఇచ్చారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించడం అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో యస్ఐ సుకుర్, వెంకటేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి పనుల జాతర షురూ



**తొలి అక్షరం/మహా ముత్తారం ఆగస్టు 22:**మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో పనుల జాతర 2025 కింద సోక్ పిట్స్ కమ్యూనిటీ సోక్ పిట్స్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్(సామూహిక మరుగుదొడ్లు), పశువుల పాక పనులు మొదలు పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా మన మండల ప్రత్యేక అధికారి,ఎం వెంకటేశ్వర్లు ముత్తారం మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో కమ్యూనిటీ సోక్ పిట్ మరియు సామూహిక మరుగుదొడ్లు మహిళా సంఘం భవనం పక్కన మగ్గు పోయించి పనులు ప్రారంభం చేయించారు. మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామీణ రహదారుల కింద (సి ఆర్ ఆర్ గ్రాంట్) 24 రోడ్లు, గ్రామపంచాయతీ భవనములు మూడు, అంగన్వాడి భవనములు మూడు, సిసి రోడ్లు 3 , మేకలషెడ్లు తొమ్మిది, వానపాముల తయారీ ఒకటి, పండ్ల తోటల పెంపకం కింద 20, కమ్యూనిటీ సోక్ పిట్లు 18, మ్యాజిక్ సోక్ ఫిట్స్ 78, పనులు ఉన్నాయని వీటన్నిటిని కూడా ఈ పనుల జాతర సందర్భంగా మొదలుపెట్టి పూర్తి చేయాలని తెలిపినారు, ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీరాజ్ శాఖ డీఈ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ యం శ్రీనివాసరావు,అదనపు కార్యక్రమ అధికారి ఎం కుమారస్వామి , ఏపిఎం మాధవి , పంచాయతి సెక్రటరీ శ్రీకాంత్ క్షేత్ర సహాయకులు పద్మ , మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా పనుల జాతర - 25 కార్యక్రమం

● అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు మంజూరు ● దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్నబియ్యం పథకం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ప్రభుత్వం: మంత్రి సీతక్క ● కొత్తగూడ మండల కేంద్రంలో 12, లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడి కేంద్రానికి భూమి పూజ చేశారు, ● తిరుమలగండి - పూట్టల భూపతి గ్రామాల మధ్య 1,కొట్టి 60 లక్షలతో నిధులతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు, ● గంగారం హాస్టల్ గుంపు, ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోసారు, ● 1, కోటి 50 లక్షల నిధులతో నిర్మించనున్న గంగారం మండలం ప్రజా పరిషత్ కార్యాలయ నూతన భవన్ నిర్మాణం కోసం భూమి పూజ చేసారు, ● గంగారం మండలానికి చెందిన (825) లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసారు,





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనుల జాతర - 25, కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తుందని, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ, రైతు భరోసా, బీమా, పెట్టుబడి సహాయం, రుణమాఫీ వడ్డీలేని రుణాలు, 200 వందల యూనిట్ల ఉచిత విద్యుత్, మహ లక్ష్మీ పథకం అమలు, గృహ జ్యోతి పథకం కింద 500 లకే సబ్సిడీ గ్యాస్ పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు,గతంలో రేషన్ కార్డులు పంపిణీ లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని, ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు,మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు బస్ లు, పెట్రోల్ పంపులు నిర్వహణ,ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, చేస్తుందన్నారు,గంగారం మండలంలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సోలార్ ఉత్పత్తి, కోళ్ళ ఫామ్ హార్టికల్చర్ వ్యవసాయ, సహకార, గ్రామీణ ప్రాంతాల్లో దొరికే ఉత్పత్తుల వినియోగం పై తదితర రంగాల్లో ఉపాధి అవకాశలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంత్రి అన్నారు,రాష్ట్ర వ్యాప్తంగా యూరియా పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి కొరత నివారణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్,రెవెన్యూ డివిజనల్ అధికారినీ కృష్ణవేణి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, డిఎసఓ ప్రేమ్ కుమార్, ఏడిఎ శ్రీనివాస్, సిడిపిఓ నిలోఫర్ అజ్మీ, తహసిల్దార్ బాల కృష్ణ, ఏంపిడిఓ మున్నార్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీ రాజ్, వీరభద్రం, విద్యాసాగర్, హౌసింగ్ పీడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నిజాం నిరంకుశత్వంపై ఎత్తిన అక్షర కరవాలం షోయబుల్లాఖాన్

● జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్టకార్యదర్శి....శంతన్ రామరాజు

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 22:** నిజాం నిరంకుశత్వంపై ఎత్తిన అక్షర కరవాలం షోయబుల్లాఖాన్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నాడు. షోయబుల్లాఖాన్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించాడు. టీఎస్ జె యు జిల్లా అధ్యక్షుడు చిర్రగోని ఉదయ్ ధీర్ అధ్యక్షతన టి యు డబ్ల్యు జే హెచ్ (143) పట్టణాధ్యక్షులు అనుమాండ్ల రామకృష్ణా రెడ్డి నిర్వహించిన ఈకార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. శంతన్ రామరాజు మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వంపై తన కలంతో అగ్నిధార కురిపించిన అక్షర సేనాని షోయబుల్లాఖాన్ అని కొనియాడాడు. బాహ్యప్రపంచానికి అంతగా తెలియని త్యాగదనుడు, భయమెరుగని పాత్రికేయుడని పేర్కొన్నాడు.1920, అక్టోబర్ 17న. ఖమ్మం జిల్లా సుబ్లేడ్ లో షోయబ్ జన్మించాడన్నాడు. ఉత్తరప్రదేశ్ నుండి తెలంగాణకు వలసవచ్చిన షోయబ్ తండ్రి రైల్వే ఉద్యోగిగా స్థిరపడ్డాడని అన్నాడు. షోయబ్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి జర్నలిజం పట్టా తీసుకొని తాజ్వీ పత్రిక




ద్వారా నాటి నిజాం నిరంకుశత్వాన్ని, ఖాసీం రజ్వీ దురాగతాలను ఎండగట్టాడాని అన్నాడు. ప్రభుత్వం ఆపత్రికను నిషేదించడంతో ఇమ్రోజు పత్రికద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను, పాలకుల లోపాలను ఎత్తి చూపుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి .మద్దతుగా నిలిచాడన్నాడు. నిర్భయుడిగా, మొండివాడుగా, నిస్వార్థంగా తాను నిర్దేశించుకున్న లక్ష్యంకోసం ఎంతకైనా తెగించే వ్యక్తిగా షోయబుల్లాఖాన్ పేరు తెచ్చుకున్నా డన్నాడు. పాకిస్థాన్ కు దన సహాయంతో పాటు తెలంగాణను విలీనం చేసే కుట్రలను నాటి ప్రభుత్వంలోని ఏడుగురు పెద్దలు లేఖల ద్వారా బయటి ప్రపంచానికి తెలియబర్చడంతో ఆలేఖలను యధాతథంగా షోయబుల్లాఖాన్ తన పత్రికలో ప్రచురించా డన్నాడు. ఈవిషయాన్ని భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకుపోతుందనే భయంతో షోయబుల్లాఖాన్ పై నిజాం సర్కార్ కక్ష కట్టిందన్నాడు. పత్రిక విధులు ముగించుకొని రాత్రి సమయంలో ఇంటికి వెళ్తున్న షోయబుల్లాఖాన్ హత్యకు గురవడం విచారకరమన్నాడు. చేతులు నరికి అత్యంత పాశవికంగా హత్యగావించిన తీరు షోయబుల్లాఖాన్ నిజాయితీని, సమాజంపట్ల తన నిబద్ధతను తెలియజేస్తోందని శ్లాఘించాడు. కుల, మత, ప్రాంత, భాషా విభేదాలతో అట్టుడుగుతున్న నేటి సమాజానికి షోయబుల్లాఖాన్ లాంటి జాతీయవాద పాత్రికేయుడు అవసరం అని అన్నాడు. ఏదేమైనా ఆయన బలిదానం, పోరాట స్ఫూర్తి సూర్య చంద్రులున్నంత వరకూ పాత్రికేయ ప్రపంచంలో విరాజిల్లుతూనే వుంటాయని అన్నాడు.ఇంతటి గొప్ప వ్యక్తి జీవిత చరిత్ర ముందుతరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలన్నాడు. ఆ మహనీయుని పేరిట అవార్డులు అందించి ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని నెలకొల్పి పత్రికాప్రపంచానికి నూతనోత్సాహాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేసాడు. మన మహబూబాబాద్ లో ఆయన పేరుమీద ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని అన్నాడు.నేటి పత్రికా రంగానికి షోయబుల్లాఖాన్ జీవిత చరిత్ర కరదీపిక అని అన్నాడు. కమ్మగాని కృష్ణమూర్తి, సిరిపురం వీరన్న, రామరాజు ఉపేందర్, గంగాదరి బాలరాజు, వన ప్రేమికుడు ధైద వెంకన్న, ధరంసోత్ నారాయణ్ సింగ్ తో పాటు పాత్రికేయులు వర్మ, కుమార్, గుండెల రాజు, గాండ్ల కిరణ్, లక్ష్మణ్, అంబాల కుమార్, తక్కెళ్లపల్లి శ్రీనివాస, రాచకొండ ప్రవీణ్, యాకన్న, సురేష్, కొండి సాయికిరణ్ నేత, గోనె శ్యామ్ పాల్గొన్నారు.

# సేవ్ హైదరాబాద్... చలో సచివాలయం



● బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్

● అరెస్టులకు భయపడేది లేదంటున్న పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్ పటేల్

**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 22:** భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ నగరంలో ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు, ప్రభుత్వం సరిగ్గా స్పందించడం లేదంటూ సేవ్ హైదరాబాద్ చలో సచివాలయం పేరిట పిలుపునివ్వడంతో షాద్ నగర్ పట్టణ పోలీసులు షాద్ నగర్ పట్టణ బిజెపి నాయకులను ముందస్తు చర్యలో భాగంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణ బిజెపి అధ్యక్షుడు హరి భూషణ్ పటేల్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి గారూ..! మీ అక్రమ అరెస్టులకు మేము బెదిరేది లేదు, సేవ్ హైదరాబాద్ బిజెపి పిలుపును అడ్డుకోవడం అన్యాయం అంటూ ప్రజాస్వామ్యం నశించింది, పోలీసులు ప్రజల నమ్మకాలను వమ్ము చేస్తున్నారంటూ హైదరాబాద్ నగరంలో నెలకొన్న తీవ్ర సమస్యలపై బిజెపి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవ్ హైదరాబాద్ శాంతియుత నిరసనలను ప్రభుత్వం అడ్డుకోవడం ఆమోదనీయం కాదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలో పూర్తిగా కలకలం జరిగింది. నాళాలు పొంగిపొర్లడం, రోడ్లు కుంగిపోవడం, విద్యుత్ వైర్ల వల్ల అపార ఇబ్బందులు, నగర గల్లీలలో ఎలుకలు, కుక్కల బెడదతో చలామణి సడలిపోవడం వంటి అనేక సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రతరమైనది కాగా, అంతర్గత మురుగు కాలువలు మరింత ఇబ్బంది కలిగించే అంశం కావడం విశేషం.ఈ సవాళ్ళ పరిష్కారం కోసం బిజెపి పిలుపు మేరకు ఉద్యమించబోతున్న నాయకులను, హౌస్ అరెస్టులు వంటి అక్రమ చర్యల ద్వారా అదుపు చేసే పని అన్యాయం. స్నేహపూర్వకంగా, శాంతియుతంగా తమ హక్కులను వాడుకునే నేతలను పోలీసులు బలవంతంగా ముందస్తు అరెస్టులు చేయడం మానుకోవాలి.కాంగ్రెస్ ప్రభుత్వం సార్వత్రికంగా ప్రజాస్వామ్యాన్ని నిరోధిస్తూ, తెలంగాణాలో పోలీస్ రాజ్యాన్ని మోపుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకదని బిజెపి గట్టిగా విశ్వసిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కాలమానం పూర్తయినది, రేవంత్ రెడ్డి తమ పార్టీ చివరి ముఖ్యమంత్రి మాత్రమే!భవిష్యత్తులో బిజెపి అధ్వర్యంలో విస్తృత యుద్ధాలు, నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించి, ప్రజలు బిజెపి పోరాటాలకు మనసారా మద్దతు ఇవ్వాలని కోరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా షాద్నగర్ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు, బిజెపి నాయకుడు కోరమోని హరి భూషణ్ పటేల్ వారి ఇంటి నుండి ముందస్తుగా అరెస్టు చేయబడిన సంగతి తీవ్ర నిందనీయము. పట్టణ నేతలు వంశీ కృష్ణ, జంబుల నర్సిములు, గట్టోజు విజయ్, రాజేష్, మనోహర్, ఆంజనేయులను ప్రివెంట్ అరెస్ట్ చర్యలలో భాగంగానే పిలిపించారని సమాచారం మాకు అందింది. ప్రజల సమస్యల తుది పరిష్కారం కొరకు పోరాడాలనుకున్న నాయకులను ముందస్తు చర్యలో భాగంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదని, అరెస్టులతో అభివృద్ధిని ఆపలేరని, మీరు ఎంతగా ఆపితే%బ% భారతీయ జనతా పార్టీ అంత ముందుకు వెళుతుందని, ప్రజల సమస్యల పరిష్కారం కై ఎట్టి పరిస్థితుల్లో వెనుకడుగు వేసేది లేదని, ప్రజల డబ్బుతో జీతాలు తీసుకుంటున్న పోలీసు అధికారులు, ప్రజా సమస్యల పరిష్కారం కై పోరాటం చేయాలనుకున్న నాయకులను అణిచిపెట్టడం, ప్రజా సమస్యల పరిష్కారానికి అవరోధాలు కల్పించడం భావ్యం కాదని, పోలీసులు ఇప్పటికైనా ఇటువంటి చర్యలు మానుకోవాలని, నాయకుల మాటలు వినకుండా ప్రజలకు తోడుగా నిలవాలని, అప్పుడే పోలీసు వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం కలుగుతుందని అన్నారు.



# గోవాలో చిరు బర్త్‌డే వేడుకలు

## కేక్ కట్‌చేసి తినిపించిన చెర్రీ -మీరెప్పటికీ మా హీరో అంటూ వీడియో షేర్

మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఆయన తన కుటుంబంతో కలిసి గోవాలో వేడుకలు జరుపుకున్నారు. బర్త్‌డే వేడుకలు ఎంతో ఘనంగా, సంతోషంగా జరుగుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా చిరుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరు తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. వీడియోలో చరణ్ తండ్రికి కేక్ తినిపిస్తూ, చిరు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపిస్తూ కుమారుడిపై తనకున్న ప్రేమని తెలియజేశారు. అయితే రామ్



చరణ్ తన తండ్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్ అందరిని టచ్ చేసింది. 'ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న... ఇది మీ లాంటి గొప్ప వ్యక్తికి జరుపుతున్న గొప్ప సంబరమూ! నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరు. నా ప్రతి విజయం, నేను మోసే విలువలు అన్నీ మీ నుంచే వచ్చాయి. 70 ఏళ్ల వయసులో కూడా మీరు మా హృదయంలో యువకుడిగా ఉండి, మాకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మీరు ఆనందంగా, ఆరోగ్యంగా మరెన్నో సంవత్సరాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఎవరైనా కోరుకునే ఉత్తమ తండ్రిగా ఉన్నందుకు ధన్యవాదాలు నాన్న అంటూ రామ్ చరణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. మెగా అభిమానులు ఈ వీడియోను పెద్దఎత్తున షేర్ చేస్తూ హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాని షేక్ చేస్తున్నారు.



# టిడిఆర్ సినిమా షురూ

టి.డి.ఆర్ సినిమాస్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్.1 గా కుంచం శంకర్ దర్శకత్వంలో తలారి దినకరణ్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు గురువారం నాడు ఘనంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి రామ్ అబ్బరాజు క్లాప్ నివ్వగా, ప్రశాంత్ కుమార్ దిమ్మెల కెమెరా స్విచాన్ చేసి గౌరవ దర్శకత్వం వహించారు. రామ్ అబ్బరాజు, ప్రశాంత్ దిమ్మెల, అడిదాల విజయ్‌పాల్ రెడ్డి స్క్రిప్ట్ అందించారు. పవన్ కేసరి, కావ్యా కళ్యాణ్ రామ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతాన్ని అందించనున్నారు.ఇక ఈ మూవీ ప్రారంభోత్సవం సందర్భంగా హీరో పవన్ కేసరి మాట్లాడుతూ "నా బాల్య స్నేహితుడు సన్నీ స్థాపించిన ఈ బ్యానర్ మీద సినిమా (%ఖీఅశ్రీఎ ఝఅ-అవతీ%) చేస్తుండటం ఆనందంగా ఉంది. విజయ్ మంచి సంగీతాన్ని ఇవ్వబోతోన్నారు"అని అన్నారు. తలారి హేమావతి రెడ్డి మాట్లాడుతూ "పవన్, కావ్యతో పని చేస్తుండటం ఆనందంగా ఉంది. శంకర్ ఓ మంచి కథతో రాబోతోన్నారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ కావ్యా కళ్యాణ్ రామ్, డైరెక్టర్ కుంచం శంకర్, విజయ్ బుల్గానిన్ తదితరులు పాల్గొన్నారు.

# మన శంకర వరప్రసాద్

## వెంకటేశ్ వాయిస్‌తో విడుదల




మెగా157। మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు 2025 పుట్టినరోజు మరపురాని వేడుకగా మారబోతోంది. ఫ్యాన్స్ ఆశించినట్లుగానే క్రేజీ అప్‌డేట్స్ వరుసబెట్టి వచ్చేస్తున్నాయి. మెగా అభిమానులు మాత్రమే కాదు, సినీ ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమా -టైటిల్, గ్లింప్స్ ఎట్టకేలకి విడుదలైంది.చిరంజీవి -అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా -టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు అనే -టైటిల్ కొద్ది రోజులుగా ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతుండగా, అదే -టైటిల్‌ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ -టైటిల్‌ను విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్‌తో అందించడం స్పెషల్ హైలైట్. చిరంజీవి, వెంకటేష్ మధ్య మంచి స్నేహబంధం ఉండటంతో, ఈ ప్రాజెక్ట్‌లో వెంకీ కీలక పాత్రలో కనిపించనున్నారు. గ్లింప్స్ లో చిరంజీవి సూట్ ధరించి సిగరెట్ తాగుకుంటూ అలా వస్తుండడం చూసి ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. చివరిలో గుర్రం పట్టుకొని నడుచుకుంటూ వచ్చే షాట్ కూడా అదిరిపోయింది. ఇక మన శంకర వర ప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు అంటూ వెంకీ చెప్పడం మరో హైలైట్ అయింది. ఈ సినిమా 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతోంది. గతంలో అనిల్ - వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 వంటి హిట్ కామెడీ ఎంటర్-టైనర్లు సంక్రాంతికి రిలీజై ఘన విజయం సాధించిన నేపథ్యం చూస్తే, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ కావొచ్చన్న అంచనాలు బలపడుతున్నాయి. చిరంజీవి నటిస్తున్న ఫ్యాంటసీ డ్రామా 'విశ్వంభర' నుంచి గ్లింప్స్ ఇప్పటికే రిలీజ్ కాగా, ఇది అలరించింది. ఈ చిత్రం 2026 వేసవిలో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. ఇక ఈ రోజు సాయంత్రం చిరంజీవి - బాబీ కొల్లి కాంబోలో మరో కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ ఉంటు-ంది. 'వాల్తేరు వీరయ్య' తరహాలోనే మాస్ మజా ఉన్న సినిమా ఉండబోతుందని సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుంది.

# అఖండ-2 విలన్ ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య-బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్య- బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.

# రామ్ గోపాల్ వర్మలా తయారవుతున్నావన్నారు

## : బాలీవుడ్‌పై అనురాగ్ కశ్యప్ సంచలన వ్యాఖ్యలు



ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ హిందీ చిత్ర పరిశ్రమపై, తన వ్యక్తిగత జీవితంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముంబైలోని వాతావరణం తనను మానసికంగా కుంగదీసిందని, చాలామంది తనను కాపాడే నెపంతో 'రామ్ గోపాల్ వర్మ దారిలో వెళుతున్నావు' అంటూ వ్యాఖ్యానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ముంబైని వదిలి దక్షిణాదికి మకాం మార్చానని, ఇక్కడ ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నానని ఆయన స్పష్టం చేశారు.తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనురాగ్ తన మనసులోని మాటను బయటపెట్టారు. "హిందీ చిత్ర పరిశ్రమలో నిర్మాతలు కేవలం బాక్సాఫీస్ లెక్కలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. సృజనాత్మకతను పట్టించుకోవడం లేదు. నా అభిప్రాయాలను ముక్కుసూటిగా చెబుతాననే కారణంతో నన్ను చెడుగా చూశారు. నాతో ఉంటే స్టూడియోల నుంచి అవకాశాలు రావని చాలామంది నన్ను దూరం పెట్టారు" అని ఆయన వాపోయారు.ఈ క్రమంలో తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని అనురాగ్ తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ కోసం తాను ఎంతో ఇష్టపడి చేస్తున్న 'మాగ్జిమమ్ సిటీ' అనే ప్రాజెక్ట్ అకస్మాత్తుగా ఆగిపోవడం తనను మరింత కుంగదీసిందన్నారు. "ఆ సమయంలో నేను హిందీ సినిమాలు చూడటం పూర్తిగా మానేశాను. కొత్త దర్శకులు, ముఖ్యంగా మలయాళ చిత్రాలను ఎక్కువగా చూడటం మొదలుపెట్టాను" అని పేర్కొన్నారు.

# సమంతతో 200 కోట్ల ఎక్స్‌పెరిమెంట్..?

సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఈమధ్యనే తన 15 ఏళ్ల సినీ వసంతాలను పూర్తి చేసుకుంది. ఇన్నేళ్ల జర్నీలో సమంత ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. ఇలా వచ్చి అలా కనుమరుగయ్యే హీరోయిన్స్ ఉన్న ఈ టైం లో ఏమాయ చేసావే సినిమాతో పరిచయమై తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంది అమ్మడు. కెరీర్ లో స్టార్ క్రేజ్ ని త్వరగానే అందుకుంది సమంత. తొలి సినిమా హిట్ ఆ తర్వాత రాజమౌళి దృష్టిలో పడి ఈగ ఛాన్స్ రావడం. అది కూడా సూపర్ హిట్ అవ్వడం మహేష్, ఎన్ టీ ఆర్ ఇలా స్టార్స్ తో నటించడంతో అమ్మడి రేంజ్ మరింత పెరిగింది. తెలుగులో స్టార్ అయిన సమంత అటు తమిళ్ లో కూడా అదే రేంజ్ ఫాం కొనసాగించింది. అక్కడ కూడా స్టార్స్ తో కలిసి జత కట్టి సత్తా చాటింది సమంత. ఐతే ప్రతి హీరోయిన్ కి కెరీర్ లో కొంత బ్యాడ్ టైం నడుస్తుంది. ఆ టైం ని కూడా చాలా సమర్ధవంతంగా ఫేస్ చేసింది సమంత. ఇక పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్ లో ఇబ్బందులు ఆమెను మరింత వెనక్కి నెట్టాయి. మయోసైటిస్ వల్ల సమంత దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. తెలుగులో విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేసిన సమంత ఆ తర్వాత మరో సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆఫ్టర్ లాంగ్ టైం సమంత శుభం సినిమాలో క్యామియో రోల్ చేసింది. ఐతే అది కూడా తన సొంత ప్రొడక్షన్ లో సినిమా కాబట్టే ఆ మూవీలో నటించింది. సమంత ఎప్పుడు వెనకపడ్డా కూడా దానికి డబుల్ ఫోర్స్ తో మళ్లీ ముందుకొస్తుంది. సమంత లీడ్ రోల్ లో రక్త్ బ్రహ్మాండ్.. ఈమధ్యనే సిటాడెల్ సీరీస్ తో బాలీవుడ్ ఆడియన్స్ ని అలరించిన సమంత. నెక్స్ట్ రాజ్ అండ్ డీకే చేస్తున్న 200 కోట్ల ప్రాజెక్ట్ లో నటిస్తుందని తెలుస్తుంది. రాజ్ అండ్ డీకే తో సమంత కాంబినేషన్ లో ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ సీరీస్ లు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆ దర్శక ద్వయం నెక్స్ట్ రక్త్ బ్రహ్మాండ్ అంటూ ఒక సీరీస్ ని చేస్తున్నారు. నెట్ ఫ్లిక్స్ నిర్మిస్తున్న ఈ వెబ్ సీరీస్ 200 కోట్ల బడ్జెట్ తో భారీగా ఉండబోతుందట. ఇందులో సమంత లీడ్ రోల్ లో నటిస్తుంది. సమంతతో అంత బడ్జెట్ తో సీరీస్ అంటే రిస్క్ అనే చెప్పొచ్చు. కానీ సబ్జెక్ట్ మీద ఉన్న కాన్ ఫిడెన్స్ తో ముందుకెళు_న్నారట.

